కమనీయం.. రమణీయం



స్వామివార్లకు అలంకరించే మధుపర్కాన్ని చూపుతున్న పండితులు



స్వామివార్ల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వైభవంగా హంసలదీవి వేణుగోపాలుడి కల్యాణం

కోడూరు: పున్నమి వెన్నెల కాంతుల్లో.. అతి పురాతనమైన కల్యాణ వేదికపై వేద పండితుల మంత్రోచ్చరణలు.. మంగళవాయిద్యాల మధుర స్వరాల.. పూల పరిమళాలు నడుమ హంసలదీవి వేణుగోపాలుడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివార్ల కల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. ఆలయ ఈఓ సుధాకర్ కల్యాణమూర్తులకు పట్టువస్త్రాలు సమర్పించారు. వేణుగోపాలుడిని గజవాహనంపై ఆలయం చుట్టూ ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. గుంటూరు జిల్లా అనంతవరానికి చెందిన కుప్పా రామగోపాల సోమయాజీ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. వేద పండితులు నందకుమార్, దివి శ్రీరంగాచార్యులు, కుమార్‌ల మంత్రవచనాల నడుమ కల్యాణతంతును జరిపారు. తిరుమల తిరుపతి వేద పాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని, ప్రముఖ పండితులు అగ్రీవాచార్యులు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. కల్యాణంలోని ఘట్టాలను, స్వామివార్ల, అమ్మవార్ల గుణగణాలను వివరించిన తీరు ఎంతగానో ఆకట్టుకుంది. ముందుగా జగాజ్యోతి కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు.

వేలాదిగా తరలివచ్చిన భక్తజనం ..

వేణుగోపాలుడి కల్యాణం తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రాత్రి 11.15 గంటలకు ప్రారంభమైన కల్యాణం అర్ధరాత్రి 2.30 గంటల వరకు సాగింది. కల్యాణతంతును భక్తులు తిలకించి పులకించారు. భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా దేవదాయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేణుగోపాలస్వామి వారి మూలమూర్తిని, రాజ్యలక్ష్మీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.



చల్లపల్లిలో స్వామివారి గ్రామోత్సవం

గ్రామోత్సవం..

చల్లపల్లి: గ్రామంలోని శ్రీ చక్రస్థిత అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్తలు యార్లగడ్డ హరీశ్వర ప్రసాద్ జగాజ్యోతి వెలిగించి కల్యాణోత్సవాలను ప్రారంభించారు. శనివారం రాత్రి స్వామి వారి కల్యాణం, ఆదివారం రాత్రి కల్యాణ మూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఘంటసాల శతానంద శాస్త్రి, ఘంటసాల అరుణ కుమార్ కల్యాణ వేడుకలు నిర్వహించారు.

కాశీవిశ్వేశ్వరుడి కల్యాణం..

కోడూరు: హంసలదీవిలోని కాశీవిశ్వేశ్వరస్వామి వారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ముత్యాల పందరిలో అన్నపూర్ణ, బాలాత్రిపుర సుందరీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. గుంటూరు జిల్లా అనంతవరానికి చెందిన కుప్పా వంశీయులు ఉభయ దాతలుగా వ్యవహరించి వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణతంతు నిర్వహించారు. అనంతరం కల్యాణమూర్తులకు ద్వాదశ ప్రదక్షిణలు జరిపి, ఆలయ ప్రవేశం చేయించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పండిత కుటుంబీకులంతా కల్యాణంలో పాల్గొనడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



కల్యాణమూర్తులకు ద్వాదశ ప్రదక్షణలు చేయిస్తున్న భక్తులు

క్లుప్తంగా

కార్నియాల సేకరణ



సావిత్రి (ఫైల్)

నాగాయలంక: గ్రామంలోని 9వ వార్డుకు చెందిన చిట్టా సావిత్రి(90) ఆదివారం మృతిచెందింది. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శివనాగేశ్వరరావు ప్రోత్సాహంతో ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకొచ్చారు. నేత్రదాన మోటివేటర్స్ టి.రఘుశేఖర్, కె.నారాయణల సహకారంతో ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ అమరుద్దీన్ బృందం మృతురాలి కార్నియాలు సేకరించారు.

తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనోత్సవం



చిలకలపూడ(మచిలీపట్నం): బుట్టాయిపేటలోని చిట్టి పిళ్లారయ్య స్వామివారి దేవస్థానంలో ఆదివారం తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనోత్సవం ఘనంగా నిర్వహించారు. చిట్టి పిళ్లారయ్య స్వామి ఆవిర్భవించి 255 సంవత్సరాలైన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామని ఆలయ పర్యవేక్షకులు తెలిపారు. కార్యక్రమంలో జేఎస్ఎస్ కృష్ణారావు, సింగరాజు గోవర్ధన్ పాల్గొన్నారు. అనంతరం విజయవాణి సంగీత కళాశాలకు సంబంధించి మొదలి చంద్రశేఖర్ శిష్య బృందం సంకీర్తనలు ఆలపించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

వృద్ధునికి ఆర్థిక సాయం

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): అనారోగ్యంతో బాధపడుతున్న ఉత్తర చిరువోలులంకకు చెందిన వృద్ధుడు నడకుదుటి ఆంజనేయులుకు అవనిగడ్డ శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు శనివారం రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. స్థానికులు మరో రూ. 2 వేలు అందించారు. బచ్చు శ్రీనివాసరావు, విశ్వనాథపల్లి వేణు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

కృత్తివెన్ను: చెరుకుమిల్లి గ్రామంలోని సాయిబాబా మందిరం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రతి ఏటా మాఘమాసంలో పౌర్ణమికి రెండు రోజుల ముందు నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి ఏకనామ కీర్తనలు చేసి, పౌర్ణమి నాడు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మూడు రోజులు రైలు గేటు మూసివేత

పెడన: పట్టణంలోని ప్రధాన రహదారిలో పెడన నుంచి మచిలీపట్నం వైపుగా వెళ్లే మార్గంలోని రైలు గేటును సోమవారం నుంచి బుధవారం వరకు మూసివేస్తారని పెడన ఎస్‌ఐ వి. రవిచంద్రకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి సంబంధిత శాఖాధికారుల నుంచి పెడన పోలీస్ స్టేషన్‌కు లిఖిత పూర్వకంగా సమాచారం అందిందని చెప్పారు. దీంతో ట్రాఫిక్ మళ్లించామని చెప్పారు. వాహన చోదకులు బైపాస్ రోడ్డు నుంచి రాకపోకలు సాగించాలని కోరారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



కోడూరు: హంసలదీవి వేణుగోపాలస్వామి వారి ఆలయంలో ఏర్పాటు చేసిన కూచిపూడి భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. గుడివాడ నటరాజ నాట్య కళాశాలకు చెందిన కళాకారులు ఆలయ ఆవరణలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. డ్యాన్స్ మాస్టారు భాగవతుల వెంకట సీతారామ శర్మ ఆధ్వర్యంలో 20 మంది కళాకారులు భరత నాట్యం ద్వారా వివిధ కళారూపాలను ప్రదర్శించారు. రింగ్ డ్యాన్స్, స్నేక్ డ్యాన్సులతో చిన్నారి కళాకారులు అలరించారు. వివిధ దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. దేవాలయ ఈఓ సుధాకర్ కళాకారులకు జ్ఞాపికలు అందించి సన్మానించారు.

వృద్ధాశ్రమానికి సరుకులు అందజేత

గుడివాడటౌన్: స్థానిక బైపాస్ రోడ్డులోని మమత వృద్ధుల ఆశ్రమానికి ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. గుడివాడ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కలపాల కిరణ్ తండ్రి మోజెస్ జ్ఞాపకార్థం సరుకులు అందించారు. సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే సంకల్పంతో సరుకులు అందజేసినట్లు కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చిననారాయణరెడ్డి, నాయకులు కె.ఆంజనేయ ప్రసాద్, చుండూరి శేఖర్, వాకర్స్‌క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సాకారం



శంకుస్థాపన చేస్తున్న జోగి రాజీవ్

పెడన: అర్హతే ప్రమాణికంగా నిరుపేదల సొంతింటి కలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాకారం చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. పట్టణంలోని పల్లోటి లే అవుట్‌లో జబీర్ లబ్ధిదారుని ఇంటి నిర్మాణానికి రాజీవ్ ఆదివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తున్నారని చెప్పారు. ప్రతి లబ్ధిదారుడు తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఇంటిని వేగంగా నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు, పట్టణ సచివాలయాల సమన్వయకర్త మతీన్‌ఖాన్, కౌన్సిలర్ బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు



లబ్ధిదారుకు పొజిషన్ సర్టిఫికెట్ అందజేస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్నామని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కిట్టు అన్నారు. బందరు మండలం మేకవానిపాలెం పంచాయతీ శివారు నవీన్ మిట్టల్ కాలనీకి సమీపంలోని హమాలీస్ కాలనీలో ఎంతో కాలంగా జీవిస్తున్న ఎనిమిది కుటుంబాలకు ఆదివారం కిట్టు చేతుల మీదుగా పొజిషన్ సర్టిఫికెట్లను అందజేశారు. కిట్టు మాట్లాడుతూ బందరు నియోజవకర్గంలో వేలాదిమంది పేదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు అందజేసిందన్నారు. ప్రతి పేద కుటుంబం సొంతింటిలో తలదాచుకోవాలన్నదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని చెప్పారు. కార్యక్రమంలో మేకవానిపాలెం మాజీ సర్పంచ్ మేకా శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ తోట సత్యనారాయణ, పోతిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ మేకా లవకుమార్ (నాని) తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవాలు



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

కోనేరుసెంటర్: బందరు మండలం పెదకరగ్రహారం గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పెదకరగ్రహారంతో పాటు చినకరగ్రహారం, క్యాంపుబెల్‌పేట, పల్లెపాలెం, హమాలీ కాలనీ, నవీన్ మిట్టల్ కాలనీ, ఆదర్శ నగర్, కొత్తపేట, మేకవానిపాలెం, చిలకలపూడి, కొత్తపేట తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. స్వామివారికి కానుకలు సమర్పించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గం కన్వీనర్ శొంఠి ఫరీద్, మాజీ కౌన్సిలర్ శీలం మారుతీరావు, సీనియర్ నాయకులు బొర్రా నటేష్‌బాబు, ఫణికుమార్, మట్టా నాగరాజు, కొండా తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతుల పక్షపాతి సీఎం జగన్

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఘంటసాల ఏఎంసీ చైర్మన్‌గా వేమూరి ప్రమాణ స్వీకారం

ఘంటసాల(అవనిగడ): రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావు ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఘంటసాల విశ్వేశ్వరస్వామి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన ఎరువులు, పురుగు మందులతో పాటు సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నారన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. జగనన్న చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఘంటసాల నూతన ఏఎంసీ పాలకవర్గం రైతుల సమస్యల పరిష్కారానికి, మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. తొలుత కొడాలి నుంచి తీన్మార్ డప్పులు, మేళతాళాలతో వేమూరి వెంకట్రావు భారీ ఊరేగింపుగా తరలివచ్చారు. అనంతరం ఆయనతో పాటు వైస్ చైర్మన్ తుంగల నాగలక్ష్మి, పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే సింహాద్రి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్ సీపీ విజయవాడ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్, ఆర్టీసీ కృష్ణా జిల్లా రీజనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అభినందించారు. జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఎంపీపీ వేమూరి రజనీకుమారి, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న వేమూరి, చిత్రంలో ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు

సింధు స్నానాలకు పోటెత్తిన భక్త జనం



కృత్తివెన్ను మండలం పెదగొల్లపాలెం వద్ద సింధు స్నానాలకు వచ్చిన భక్తులు



సాగర సంగమం వద్ద జల్లు స్నానాలు

కృత్తివెన్ను: పవిత్ర మాఘమాసంలో పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం జరిగిన సింధు స్నానాలకు భక్తులు పోటెత్తారు. మండల పరిధిలోని పెదగొల్లపాలెం, చినగొల్లపాలెం, ఇంతేరు బీచ్‌ల వద్ద భారీగా ప్రజలు స్నానాలు ఆచరించారు. ఆదివారం కావడంతో యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో స్నానాలు చేసినట్లు అధికారులు తెలిపారు. యువత బీచ్ వద్ద వాలీబాల్, కబడ్డీ తదితర ఆటలతో సందడి చేశారు. స్నానాలకు వచ్చే భక్తుల కోసం సంబంధిత అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెదగొల్లపాలెం బీచ్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది.

మంగినపూడి బీచ్‌లో..

కోనేరుసెంటర్: మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో ఆదివారం భక్తులు సింధు స్నానాలు ఆచరించారు. తెల్లవారు జాము 5 గంటల నుంచే భక్తులు బీచ్‌కు భారీగా తరలివచ్చారు. సముద్రంలో స్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం దత్తాశ్రమంలోని 11 బావుల్లో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సింధు స్నానాలను పురస్కరించుకుని భక్తుల రాకతో మంగినపూడి బీచ్ పోటెత్తింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. భక్తులకు అవసరమైన తాగునీరు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సింధు స్నానాలను పురస్కరించుకుని బందరు సబ్-డివిజన్ తరఫున పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. బందరు డీఎస్పీ మాసూంబాషా బందోబస్తును పర్యవేక్షించారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది బీచ్ వద్ద శానిటేషన్ పనులను పర్యవేక్షించారు.

సాగర సంగమం వద్ద జల్లు స్నానాలు..

కోడూరు: కృష్ణమ్మ సముద్రంలో కలిసే పవిత్ర కృష్ణా సాగర సంగమం ప్రాంతం వద్ద భక్తులకు అధికారులు జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. సంగమం వద్ద ఊహకందని లోతు ఉండటంతో పర్యాటకుల భద్రత దృష్ట్యా జల్లు స్నానాలకు శ్రీకారం చుట్టారు. ఆదివారం సింధు స్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులంతా జల్లు స్నానాలు చేశారు. సింధు స్నానాలకు వచ్చిన భక్తుల వాహనాలను పోలీసులు బీచ్ వద్దే నిలిపివేయడంతో మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి భక్తులు సంగమం వద్ద స్నానాలు ఆచరించారు. తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, మత్స్యశాఖ ఎఫ్‌డీఓ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.

సింధుస్నానం ఆచరించిన ఎమ్మెల్యే సింహాద్రి దంపతులు



సముద్రుడికి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి దంపతులు

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం కుటుంబ సమేతంగా సింధుస్నానం ఆచరించారు. సూర్యోదయ వేళ సముద్రుడికి ప్రత్యేక పూజలు చేసి పుణ్యస్నానం చేశారు. సముద్రుడికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను సమర్పించారు. వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ పరిశీలకుడు కడవకొల్లు నరసింహారావు దంపతులు కూడా సింధుస్నానం చేశారు. పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులతో మాట్లాడి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో భక్తుల రాక, ట్రాఫిక్ అంశాలపై చర్చించారు. సాగర సంగమ ప్రాంతాన్ని పరిశీలించి, కృష్ణమ్మ పాదాలు, విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హంసలదీవి వేణుగోపాలస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు దుశ్శాలువాలతో సత్కరించారు.

అంగరంగ వైభవంగా అలుగు సేవ



పాల్గొన్న మంత్రి జోగి రమేష్



జ్యోతి ఊరేగింపు

పెడన: పట్టణంలోని చౌడేశ్వరి దేవి జ్యోతిర్మహోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వేకువ జాము వరకు అలుగు సేవా వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఉత్సవాలకు హాజరుకాగా మున్సిపల్ వైస్ చైర్మన్ బళ్ల జ్యోత్స్నరాణి, కౌన్సిలర్లు గంగయ్య, గోపీ తదితరులతో పాటు ఉత్సవ కమిటీ, పడమట యువజనులు ఘన స్వాగతం పలికారు. మంత్రి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి వెండి కవచం సమర్పణ



అమ్మవారికి నూతన వెండి కవచం బహూకరించిన యువజన సంఘం నాయకులు

చల్లపల్లి: ఆర్యవైశ్య యువజన సంఘం స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సంఘ అధ్యక్షుడు వరదా రాజశేఖర్, ఉపాధ్యక్షుడు విస్సంశెట్టి మారుతీరామ్, ప్రధాన కార్యదర్శి దేసు శివకిషోర్‌లు గ్రామంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారికి వెండి కవచం బహూకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి శివరామకృష్ణ, మామిళ్లపల్లి హేమంత్ కుమార్ నూతన వెండి కవచాన్ని అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తమ్మన సత్య వెంకట సాంబశివరావు, ఆలపాటి లోకేష్, భృగుమళ్ల దుర్గా ప్రసాద్, జల్లూరి నరేంద్ర, గుండా అనిల్ కుమార్, జూపూడి కిరణ్ కుమార్, ఆర్యవైశ్య సంఘ పెద్దలు పాల్గొన్నారు.

కిక్కిరిసిన కార్తికేయుని ఆలయం



మోపిదేవి: కార్తికేయుని ఆలయ ప్రాంగణం ఆదివారం భక్తులతో కళకళలాడింది. మాఘ పౌర్ణమి ఆదివారం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చారు. ఆలయంలో స్వామివార్ల నిత్య కల్యాణంలో పాల్గొనే భక్తులు, పాలపొంగళ్లు, తలనీలాలు సమర్పించుకునే వారు, చెవిపోగులు కుట్టించుకునే వారితో కిక్కిరిసిపోయింది. ఉదయం ఐదు నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్యూలైన్లు కిటకిటలాడాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు పర్యవేక్షించారు.

రిజిస్ట్రేషన్ ఉద్యోగులకు శిక్షణ

కోనేరుసెంటర్: మచిలీపట్నం రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ కార్యాలయంలో ఆదివారం జిల్లాలోని రిజిస్ట్రేషన్ ఉద్యోగులకు జిల్లా రిజిస్ట్రార్ టి. ఉపేంద్రరావు అధ్యక్షతన శిక్షణ తరగతులు నిర్వహించారు. రిజిస్ట్రేషన్ శాఖ, స్టాంపు యాక్టు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ విధానం, నియమ నిబంధనలు తదితర అంశాలపై జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా ఎంవీ అండ్ ఆడిట్ డీఆర్ కల్యాణం రామారావు మరో అతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా స్థాయి సబ్ రిజిస్ట్రార్‌లు, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్‌లు పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ కల్యాణం



కోడూరు: దింటిమెరక సమీపంలోని 17వ నెంబర్ పంటకాలువ పక్కనే ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద స్వామి వార్ల కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని గోపయ్య-తిరుపతమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన ప్రముఖులు ఉభయ దాతలుగా వ్యవహరించగా, పండితులు కల్యాణాన్ని జరిపించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లను సిద్ధం చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.